## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 | సంచిక: 9 | పేజీలు: 6 | వెల: రూ.3/- | గురువారం 23 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఎంవోయూలపై సీఎం సమీక్ష

### ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు

### అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన



**హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు,

**మొదటి పేజీ తరువాయి...**

పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు. వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.




## ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

### రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు.

# కాళేశ్వరం నివేదికపై హైకోర్టు తీర్పు

### పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దన్న హైకోర్టు

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదన్న హైకోర్టు

### తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచనలో ప్రభుత్వం

**కేసీఆర్, హరీశ్‌రావుకు ఊరట**

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై తెలంగాణ హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఈ అంశంలో జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన కేసీఆర్, హరీశ్‌రావులకు న్యాయస్థానం ఊరట కల్పించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. విచారణ చేసి నివేదిక ఇచ్చిన కమిషన్ : కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని హైకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ పలువురిని విచారణ చేసిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన విషయం తెలిసిందే. ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ పిటిషన్ : బ్యారేజీల్లో అవకతవకలపై విచారణ కోసం జస్టిస్ పీసీఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు ఎస్.కె.జోషి, స్మితా సభర్వాల్‌లు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి మార్చి 12న తీర్పును రిజర్వు చేసింది. మా వాదనలను పరిగణలోకి తీసుకోలేదు : జస్టిస్ ఘోష్ కమిషన్‌పై తీర్పును ఈ నెల 8న వెలువరిస్తామని ప్రకటించినా కొంత ప్రక్రియ సిద్ధం కాకపోవడంతో కోర్టు ఏప్రిల్ 22కు వాయిదా వేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో ఉల్లంఘనలు జరిగాయని, అభియోగాలు మోపే ముందు తమ వాదనను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు న్యాయస్థానం ముందు పేర్కొన్నారు. విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా కమిషన్ వేశామంటూ, మరొకరి పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయడం సరైన పద్ధతి కాదని చెప్పారు. మరోవైపు ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలపై కమిషన్ ..మిగతా 2లో



## హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు

### కాళేశ్వరంపై ఎవ్వరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

### తదుపరి కార్యాచరణపై ఇరు నేతల సమాలోచనలు

### సిబిఐ విచారణకు తీర్పు అడ్డం కాదన్న మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

కాళేశ్వరం ప్రాజెక్టులో తెలంగాణ హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు సరైందని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసిందని తెలిపారు. సీబీఐకి ఘోష్ కమిషన్ పంపిన రిపోర్టుల్లో ఎవరి పేర్లను మెన్షన్ చేయలేదని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి ఉత్తమ్ బుధవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో

# రాష్ట్రవ్యాప్తంగా బస్టాండ్లలో నిలిచిన ఆర్టీసీ బస్సులు



### తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె

### డిపోలకే పరిమితమైన బస్సులు

### విధులు బహిష్కరించి పలు డిపోల వద్ద ఆర్టీసీ కార్మికుల ఆందోళన

### ఆర్టీసీ బస్సుల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ఉదయం నుంచే ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. మంగళవారం సీనియర్ ఐఏఎస్‌ల కమిటీతో ఆర్టీసీ జేఏసీ జరిపిన చర్చలు విఫలం కావడంతో ఉదయం నుంచే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. బస్సులు నిలిపేసి అన్ని డిపోల ముందు నిరసన చేపట్టారు. తాము అడుగుతున్న 32 డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నారు. ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నేతృత్వంలోని ఐఏఎస్‌ల కమిటీ నిన్న సచివాలయంలో సుమారు 3గంటలకుపైగా ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపింది. చర్చలు విఫలం : నిన్న సాయంత్రం ఐదున్నర గంటలకు మొదలైన చర్చలు రాత్రి వరకు జరిగాయి. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను అధికారులు తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆర్టీసీ సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని ఆర్థిక పరమైన అంశాలు ఉన్నందున 4 వారాల సమయం కావాలని కమిటీ ఛైర్మన్ వికాస్ రాజ్ విజ్ఞప్తి చేశారు. అందుకు జేఏసీ అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. తమ డిమాండ్లలో ఒక్కటి పరిష్కరించేందుకు కమిటీ ముందుకురాలేదని జేఏసీ నాయకులు అన్నారు. తమ డిమాండ్లు సాధించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బస్సుల వద్ద పోలీసుల బందోబస్తు : ఉమ్మడి వరంగల్ జిల్లాలో 600 డిపోలకే ..మిగతా 2లో

# రాష్ట్రవ్యాప్తంగా బస్టాండ్లలో నిలిచిన ఆర్టీసీ బస్సులు

**మొదటి పేజీ తరువాయి...**

పరిమితమయ్యాయి. బస్సులు ఖమ్మం జిల్లాలో డిపోలకే పరిమితమైన 608 బస్సులు ఎక్కడికక్కడా నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగడంతో బస్టాండ్లలో ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. దీంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆర్టీసీ బస్సుల వద్ద పోలీసుల బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో డిపోలకే పరిమితం : గోదావరిఖని, హుస్నాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ వంటి పలు జిల్లాల్లో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమ్మె చురుకుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. మహబూబ్‌నగర్‌లో ప్రయాణికుల కోసం అధికారులు 16 విద్యుత్ బస్సులను ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో హైదరాబాద్‌లోని చర్లపల్లి చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పట్లేవు. సమ్మె ప్రభావంతో ఆటో డ్రైవర్లు ప్రయాణ ధరలు పెంచడంపై ప్రయాణికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాపిడో, ఓలా, ఉబర్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలను ఆశ్రయిస్తున్నారు. బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు : సమ్మెతో వికారాబాద్ ఆర్టీసీ డిపో నుంచి బస్సులు కదల్లేదు. వికారాబాద్ డిపో వద్ద పోలీసులు భారీగా మొహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. వికారాబాద్ డిపో వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్టీసీ కార్మికులు నిరసన తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో కార్మికుల సమ్మెవిధులు బహిష్కరించి డిపో వద్ద శాంతియుత ఆందోళన బాటపట్టారు. దీంతో బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికుల ఎదురుచూపులు చూశారు. గన్‌పార్క్ వద్దకు వెళ్లనున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు : హైదరాబాద్‌లో ఉదయం ఆర్టీసీ జేఏసీ నాయకులు గన్‌పార్క్ వద్దకు వెళ్లనున్నారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించనున్నట్లు జేఏసీ వర్గాలు తెలిపాయి. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో బస్సులు డిపోలోనే ఉండిపోయాయి. ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు డ్యూటీలకు వెళ్లకుండా నిరసనలో పాల్గొన్నారు. గోదావరిఖనిలో ఉద్యోగుల సమ్మె కారణంగా 150 బస్సులు, 600 మంది ఉద్యోగులు డిపోకే పరిమితమయ్యారు. దీంతో గోదావరిఖని బస్టాండ్, డిపో వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

# హైకోర్టు తీర్పుపై సిఎంతో ఉత్తమ్ చర్చలు

**మొదటి పేజీ తరువాయి...**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, హైకోర్ట్ తీర్పుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6ను కొట్టివేయాలని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని... కానీ జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు తప్పుపట్టలేదని స్పష్టం చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని తెలిపారు. కమిషన్ ఫైండింగ్స్‌ను కూడా హైకోర్టు తప్పుపట్టలేదని చెప్పుకొచ్చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టం 1952లోని సెక్షన్ 3 ప్రకారం జీవో ఎంఎస్ నంబర్ -6 ద్వారా ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ రాజ్యాంగబద్ధమేనని న్యాయస్థానం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కమిషన్ ఏర్పాటు అధికార పరిధిని మించింది కాదని.. అసమంజసం కాదని, అక్రమం కాదని కూడా న్యాయస్థానం స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదికలో కొందరు బాధ్యులపై చేసిన నిర్ధారణలపై హైకోర్టు అభ్యంతరం తెలిపిందని చెప్పారు. పిటిషనర్లకు నిర్ణీత ఫార్మాట్ ప్రకారం నోటీసు ఇవ్వలేదనే టెక్నికల్ అంశాన్ని తప్పుపట్టిందన్నారు. జ్యుడిషియల్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా వారిపై చర్యలు తీసుకోవద్దని పిటిషనర్లకు రిలీఫ్ ఇచ్చిందని చెప్పారు. ఇప్పటికే తమ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ చేపట్టాలని నిర్ణయించిందని అన్నారు. సీబీఐకు లేఖ రాశామని ప్రస్తావించారు. ఈ రోజు వెలువడిన హైకోర్టు తీర్పు సీబీఐ విచారణకు అడ్డంకి కాదని.. న్యాయస్థానం ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. హైకోర్టు పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని ముమ్మాటికీ నిజమన్నారు. ప్రాజెక్టుకు ఎంచుకున్న సైట్ నుంచి డిజైన్ల నుంచి నిర్మాణాలు, నిర్వహణ అన్నిచోట్ల అవకతవకలు జరిగాయని.. అన్నీ లోపాలే ఉన్నాయని.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారికి నోటీసులు ఇవ్వలేదనే కారణంగా, వాళ్లపై కమిషన్ చేసిన రిమార్క్స్ మాత్రమే ఇన్ ఆపరేటివ్‌గా ఉంటాయని హైకోర్టు తెలిపిందని అన్నారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్, టెక్నికల్ అంశమని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రజల కళ్లముందే కుంగిపోయిందని.. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాక్ కుంగిపోయిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆ బ్యారేజీ దగ్గరికు వెళ్తే ఎవరికైనా కుంగిన తీరు కనపడుతుందన్నారు. లక్ష కోట్లతో కట్టిన బ్యారేజీ మూడేళ్లకే కుంగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టు వాళ్ల హయంలోనే కుంగిపోయిందని అన్నారు. అందుకు కారణాలేమిటో తేల్చాల్సిన బాధ్యత.. తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కూడా బ్యారేజీల కుంగుబాటుకు దారి తీసిన కారణాలు, డిజైన్ల, నిర్మాణం, నిర్వహణ లోపాలపై తమ ప్రాథమిక నివేదికను బీఆర్ఎస్ హయాంలోనే సమర్పించిందని అన్నారు. బ్యారేజీలకు ఎంచుకున్న ప్రాజెక్టు సైట్ నుంచి డిజైన్లు, నిర్మాణంలో జరిగిన లోపాలన్నింటినీ తమ ప్రభుత్వం నియమించిన విజిలెన్స్ కమిషన్ బయటపెట్టిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా ఇంజనీర్లను, ఐఏఎస్‌లను, అప్పటి పరిపాలనా బాధ్యులను విచారించి నివేదికను వెల్లడించిందని తెలిపారు. బాధ్యులెవరు, దోషులెవరు.. ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో తేలుస్తామని చెప్పారు. ఏమేం లోపాలున్నాయో.. ఎన్డీఎస్ఏతో పాటు విజిలెన్స్, పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలపై ఆగస్టులోనే తమ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చకు పెట్టిందని ప్రస్తావించారు. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని సీబీఐ విచారణకు ప్రభుత్వం లేఖ రాసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన తమ ప్రభుత్వం ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ జీవోతో పాటు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. హైకోర్టు తీర్పుతో సీబీఐ విచారణకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. తీర్పు కాపీ వచ్చాక ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఆ ప్రాజెక్టు నుంచి చుక్క నీరు అందలేదని చెప్పుకొచ్చారు. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టు పేరిట ప్రభుత్వం రూ.15 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు అప్పులు, వడ్డీలు భరిస్తుందని అన్నారు. కేవలం రెండు ఫిల్లర్లు కాదని.. మొత్తం ఫౌండేషన్.. మొత్తం మూడు బ్యారేజీల పునాదులు అనుమానాస్పదంగా ఉన్నాయని.. ఇప్పటికే దేశంలో పేరొందిన సంస్థల నిపుణులందరూ అభిప్రాయపడ్డారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా మానవ తప్పిదమని చెప్పుకొచ్చారు. దేశంలోనే ఇది అతి పెద్ద విధ్వంసమన్నారు. అమూల్యమైన ప్రజాధనం వృథా అయిందని.. దీనికి బాధ్యులెవరో ప్రజల ముందు నిలబెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# కాళేశ్వరం నివేదికపై హైకోర్టు తీర్పు

**మొదటి పేజీ తరువాయి...**

వేసినట్లు తెలిపారు. మీరే ఎఫ్ఐఆర్ నమోదు చేయండి : కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీల నిర్మాణంలోని అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై సీబీఐనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు సీబీఐ డైరెక్టర్‌కు తాజాగా రాసిన లేఖలో ఎఫ్ఐఆర్ విషయాన్ని ప్రస్తావించింది. నిజానికి కాళేశ్వరం అక్రమాలపై దర్యాప్తు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం గత ఏడాది సెప్టెంబరు మొదటి వారంలోనే సీబీఐకి లేఖ రాయగా దాదాపు ఆరు నెలల తర్వాత కేంద్ర ప్రభుత్వం సంస్థ స్పందించింది.

మీ రాష్ట్రంలో ఏమైనా కేసు పెట్టరా? : రాష్ట్ర పోలీసులు ఏమైనా కేసు నమోదు చేశారా? అని సీబీఐ అడగడంతో ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని స్పష్టం చేస్తూ తాజాగా ఈ నెల 7న సీబీఐకి మరో లేఖను ప్రభుత్వం రాసింది. ఈ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. సుదీర్ఘమైన విచారణ, వాంగ్మూలాల సేకరణ అనంతరం గత ఏడాది ఆగస్టులో కమిషన్ తన రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించింది. నివేదికపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ అనంతరం కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే.

జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. ఈ తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని పేర్కొన్నారు. వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందని స్పష్టం చేశారు. ఇకనైనా రాజకీయ కుట్రలు పక్కనపెట్టి ప్రభుత్వం రైతుల కోసం పనిచేయాలన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పీసీసీ నివేదిక అని నిజమైందని మండిపడ్డారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ భవన్ వద్ద బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

"హైకోర్టు తీర్పు ప్రకారం కాళేశ్వరం కమిషన్ రిపోర్టు చెత్త బుట్టలో వేయదగినది. కమిషన్ కేసీఆర్, హరీశ్ రావు ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలి అని సూచించినపుడు వారి తరపున వాదనలు కూడా తప్పనిసరిగా వినాల్సి ఉంటుంది. దానిని ఘోష్ కమిషన్ ఏ మాత్రం పాటించలేదు. దీని కారణంగా ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది" -కేసీఆర్ తరపు న్యాయవాది

"పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పు హర్షణీయం. హైకోర్టు తీర్పుతోనైనా కాంగ్రెస్ కక్షపూరిత విధానాలు మార్చుకోవాలి. కాళేశ్వరంపై నిందలు వేసి కేసీఆర్ ప్రతిష్ట దెబ్బతీసేందుకు కుట్ర చేశారు. కాళేశ్వరానికి రెండున్నరేళ్లు మరమ్మతులు చేయలేదు. గత్యంతరం లేక ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు చేస్తున్నారు. కేసీఆర్‌పై చేసిన ఆరోపణలకు కాంగ్రెస్, బీజేపీ క్షమాపణ చెప్పాలి" - సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ మంత్రి

సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచనలో ప్రభుత్వం : మరోవైపు హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. రేపు జరిగే కేబినెట్ సమావేశంలో హైకోర్టు తీర్పు గురించి కూడా చర్చించనున్నారు. అందులోనే ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

# వేసవిలో ఆనంద యాత్రలతో పాటు భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలి

### ఎస్ పి శ్రీనివాసరావు

### చోరీలు, నీటి ప్రమాదాలపై ఎస్పీ హెచ్చరిక

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం)**

వేసవి సెలవులు మొదలయ్యాయి అంటే కుటుంబాలందరికీ ప్రయాణాల సందడి మొదలవుతుంది. ఊరికి వెళ్లడం, విహారయాత్రలు చేయడం, బంధువులతో కలసి సమయం గడపడం---ఇవి అన్నీ ఆనందాన్నిస్తాయి. అయితే ఈ సంతోష సమయంలోనే అప్రమత్తతను కోల్పోతే చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టాలకు దారితీయొచ్చని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో చాలా ఇళ్లు రోజులు పాటు మూసివేసి ఉంటాయి. ఇదే సమయాన్ని దొంగలు లక్ష్యంగా చేసుకునే అవకాశముందని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి ఇంటికి తాళం వేసి వెళ్లే ముందు నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవడం మంచిదని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని మొబైల్ ఫోన్లతో అనుసంధానం చేసుకుంటే ఎక్కడ ఉన్నా ఇంటి పరిస్థితిని గమనించవచ్చన్నారు. అలాగే, నమ్మకమైన పొరుగువారు లేదా బంధువులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయడం ద్వారా ఇంటిపై కొంతమేర పర్యవేక్షణ కొనసాగుతుంది. ఇంటి వద్ద పోస్టులు లేదా పార్సిల్స్



పేరుకుపోవడం కూడా అనుమానాలకు దారితీస్తుంది కాబట్టి ముందుగానే వాటి కోసం ఏర్పాట్లు చేసుకోవాలి. రాత్రి సమయంలో ఇంటి బయట లైట్లు వెలిగేలా ఆటోమేటిక్ టైమర్లు అమర్చడం వల్ల ఇంట్లో ఎవరైనా ఉన్నట్టుగా భావించేందుకు సహాయపడుతుందన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించినా, అపరిచిత వాహనాలు ఇంటి చుట్టూ తిరిగినా వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రజల సహకారం ఉంటేనే చోరీలను సమర్థవంతంగా అరికట్టగలమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇక వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో పాటు పిల్లల భద్రత కూడా కీలక అంశంగా మారింది. సరదాగా చెరువులు, కుంటలు, కాలువల్లో ఈతకు వెళ్లే పిల్లలు తెలియని లోతులు, మట్టి జారుడు ప్రాంతాలు, నీటి ప్రవాహం వంటి కారణాల వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రతి సంవత్సరం ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్ పి శ్రీనివాస రావు సూచించారు. పిల్లలను ఒంటరిగా నీటి వనరుల వద్దకు పంపకూడదని, ఎల్లప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే వారికి ఈతపై సరైన శిక్షణ ఇవ్వడం, ప్రమాదాలపై అవగాహన కల్పించడం కూడా ఎంతో ముఖ్యం అన్నారు. మొత్తంగా చూస్తే, వేసవి సెలవులు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం కూడా. పోలీసులు తమ వంతు బాధ్యతగా అప్రమత్తంగా ఉన్నప్పటికీ, ప్రజలు కూడా చైతన్యంతో వ్యవహరిస్తేనే చోరీలు, ప్రమాదాలు పూర్తిగా నివారించవచ్చు. చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పెద్ద నష్టాలను తప్పించుకోవచ్చు---అదే నిజమైన భద్రత అని ప్రజలకు ఆయన సూచించారు.




# జాయ్ స్కూల్ యాజమాన్యం దాతృత్వం

### మరో పాఠశాలకు కంప్యూటర్లు వితరణ

**పటాన్ చెరు, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం):**

బొల్లారంలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకుంది. బొల్లారం లోని అర్బన్ స్కూల్ కు 5 కంప్యూటర్లను జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మెన్ ప్రసాద్ రెడ్డి, డెరైక్టర్ సతీష్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ స్మిత భోగరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాక్షాయణి, హెడ్మాస్టర్ బి .సునంద, సహా ఉపాధ్యాయులు జి. విజయ, ఆర్ జ్యోతిరాణి, బి. ఝాన్సీరాణి, లక్ష్మీ ప్రసన్న, లీలా, బాల్ నర్సింహా రెడ్డి, నాగదేవి, నరేందర్ లు బృందం పాల్గొన్నారు





# శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**పటాన్ చెరు, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం):**

శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్ వేడుక ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొత్వాల్ హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల ఆహార అభిరుచులను వెలికి తీయడంలో ఫుడ్ ఫెస్టివల్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి, రుచికరమైన వంటకాలను ప్రదర్శించారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థుల్లో స్వయం ప్రతిభ, బాధ్యత భావం, వ్యాపార దృక్పథం పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు సింహాచలం, మహిపాల్ రెడ్డి, స్థానిక నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, వాగ్దేవి పాఠశాల కరస్పాండెంట్ ఉదయ్ భాస్కర్ రెడ్డి, బొల్లారం పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ప్రభుకుమార్, సెయింట్ జాన్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్

**పటాన్ చెరు, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం):**

హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసున్నారు. భగవంతుని కృపతో త్వరగా కోలుకొని ప్రజాసేవలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు.

# సమ్మె వద్దు - మాయా మాటలను నమ్మొద్దు

### టీజీఎస్ఆర్టీసీ సిబ్బంది కి యాజమాన్యం విజ్ఞప్తి"

### పారిశ్రామిక వివాదాల చట్టం, 1947 ప్రకారం సమ్మెలో పాల్గొని విధులకు హాజరు కాకపోవడం గురించి...

### ప్రియమైన కార్మిక సోదర, సోదరీమణులకు...

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 21 (ప్రభాత ఉదయం,)**

మన సంస్థ ప్రయాణికుల సేవే పరమావధిగా పనిచేస్తోంది. ఇటీవల వివిధ యూనియన్లు ఇచ్చిన సమ్మె నోటీసులపై స్పందిస్తూ, కార్మిక శాఖ , యాజమాన్యం ఇప్పటికే ఐఏఎస్ అధికారులతో కూడిన కమిటీతో చర్చల ప్రక్రియను ప్రారంభించింది. ఈ తరుణంలో కార్మికులందరూ ఈ క్రింది ముఖ్యమైన చట్టపరమైన అంశాలను గమనించాలని యాజమాన్యం కోరుతుంది:

**చట్టపరమైన నిబంధన**

పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లోని సెక్షన్ 22(1)(ఎ) ప్రకారం, సంబంధిత అధికారి వద్ద ఒక వివాదం పెండింగ్‌లో ఉన్నప్పుడు సమ్మెకు దిగడం చట్టవిరుద్ధం.

**ప్రస్తుత స్థితి:**

జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వారి వద్ద ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. ఈ ప్రక్రియ ముగియకముందే సమ్మెకు వెళ్లడం చట్టరీత్యా చెల్లదు.

**క్రమశిక్షణ చర్యలు:**

చట్టవిరుద్ధమైన సమ్మెలో పాల్గొనడం వల్ల వేతన కోతతో పాటు, ఉద్యోగ నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇది కార్మికుల భవిష్యత్తుపై మరియు వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

**యాజమాన్యం విజ్ఞప్తి:**

సంస్థ, కార్మికుల సంక్షేమం దృష్ట్యా, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి యాజమాన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంది. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, సంస్థ ప్రతిష్ఠను కాపాడవలసిన బాధ్యత మనందరిపై ఉంది. కావున, కార్మికులు మరియు యూనియన్ నాయకులు, పత్రికలు లేదా సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక పిలుపులను నమ్మవద్దు. సిబ్బంది సమ్మెను విరమించుకుని, అందరూ యథావిధిగా తమ విధులకు హాజరు కావాలని యాజమాన్యం కోరుతుంది.



ఉప్పర్ పల్లి వద్ద మల్లికార్జున్ ఖర్గే దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, సందీప్ ముదిరాజ్



కాటేదాన్ లో మల్లికార్జున్ ఖర్గే దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి, రావుల భాస్కర్, సేడం వెంకటరమణ గుప్తా, నవారు మురళీధర్ రెడ్డి తదితరులు



హైదర్ గూడ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు ఎన్ మల్లారెడ్డి, ఎం కొమురయ్య, సులిగే వెంకటేష్ తదితరులు

ప్రధాని నరేంద్ర మోదీ పై అనుచిత వాక్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దిష్టి బొమ్మలను బుధవారం రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నాయకులు వై శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, ఎన్ మల్లారెడ్డి, ఎం కొమురయ్య, షాబాద విజయ్ కుమార్, సురెడ్డి వినయ్ రెడ్డి, సులిగె వెంకటేష్, సేడం వెంకటరమణ గుప్తా తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- రాజేంద్రనగర్, ప్రభాత ఉదయం



యాచకులు, నిరాశ్రాయులను అధికారులతో కలిసి వివరాలు సేకరిస్తున్న గ్రేస్ స్వంచంధ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి

## ఆరాంఘర్ వద్ద ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం లో బాగంగా ఆరాంఘర్ చౌరస్తాలో యాచకుల సర్వే నిర్వహించారు. రాజేంద్రనగర్ పరిధిలోని ఆరాంఘర్ జంక్షన్ వద్ద గ్రేస్ ఎన్జీఓ ఆధ్వర్యంలో యాచకులు, షెల్టర్ లెస్ వ్యక్తుల సర్వే నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, యూసీడీ సిబ్బంది కలిసి పాల్గొన్నారు. సర్వేలో మొత్తం 8 మందిని గుర్తించి షెల్టర్ హోంకు తరలించడం జరిగింది. మిగతా వ్యక్తులను వారి స్వస్థలాలకు పంపించే చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రేస్ స్వంచంధ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎ సదాలక్ష్మి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి , సీఓ లక్ష్మణ్ , ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు , కేర్ టేకర్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిరాశ్రయుల సంక్షేమానికి మరియు యాచకత్వ నిర్మూలనకు కీలకమైన చర్యలు చేపట్టడం జరిగింది.



యాచకురాలి వివరాలు సేకరిస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్ లక్ష్మణ్



రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన సమ్మెలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని , పీఆర్ సీ వేతనాలను వెంటనే రిలీజ్ చేయాలని , ఆర్టీసీ యూనియన్ కు అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సమ్మె వల్ల రోజువారి ప్రయాణికులకు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల ను ప్రభుత్వం పట్టించుకుని వెంటనే పరిష్కరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తుందని హేమ సుదర్శన్ జిల్లోజు అన్నారు.



రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు



## సీనియర్ సిటిజన్స్‌కు కార్డుల పంపిణీ

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా అత్తాపూర్ వార్డ్ ఆఫిస్ యందు సీనియర్ సిటిజన్ లకు బుధవారం కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది సీనియర్ సిటీజన్స్ కి ఆసరా కార్డ్స్ అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు ఫంపిణీ చేయడం జరిగింది . ఇట్టి కార్యక్రమంలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పీడీపీ చౌరస్తాలో బుధవారం ఉదయం జరిగిన హోంశాఖ మాజీ మంత్రి పి ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమం లో పాల్గొన్న ఆయన తనయుడు, బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, తదితరులు

## నిరంతరం ప్రజల కోసం పోరాడిన వ్యక్తి స్వర్గీయ పి ఇంద్రారెడ్డి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా రాజకీయాలలో చెరగని ముద్ర వేసిన గొప్ప నాయకుడు హోంశాఖ మాజీ మంత్రి, దివంగత పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని వక్తలు గుర్తు చేసుకున్నారు. స్వర్గీయ ఇంద్రా రెడ్డి వర్ధంతిని బుధవారం ఉదయం 10 గంటలకు పీడీపీ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఇంద్రారెడ్డి తనయుడు, బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు . స్వర్గీయ ఇంద్రారెడ్డి రాజకీయ నాయకునిగా రంగారెడ్డి జిల్లాలో ప్రధాన పాత్ర పోషించి అనేకమంది నాయకులను తయారు చేసిన వారిలో ఒకరని . రంగారెడ్డి జిల్లాలో ప్రతి గ్రామంలో కార్యకర్తలు, నాయకులు ప్రజల పేర్లు పెట్టి పిలుస్తూ అందరి మంచి చెడుల్లో చురుకుగా పాల్గొనే నాయకులు గా ఇంద్రారెడ్డి కి పేరుందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్, బీ ఆర్ ఎస్ నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి, జాలిగం చిత్తారి, పోరెడ్డి ధర్మారెడ్డి, ఎస్ వెంకటేష్, ఎం రాహుల్, డి దేవదాస్, డి ఉమా రెడ్డి, బండ రాజేష్ యాదవ్, అక్కెమ్ రాఘవేందర్ యాదవ్, వీర్లపల్లి నవీన్ కుమార్, కోరని రవీందర్, మజ్జిగ నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని దొంగ మృతి

**రాజేంద్రనగర్ , ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

నిర్మాణంలో ఉన్న భవనం లో మెటీరియల్ దొంగిలిస్తున్న దొంగను భవనం వాచ్మెన్ పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు జరిగింది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మీగూడా బృందావన్ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలోకి చొరబడిన గుర్తుతెలియని దొంగ మెటీరియల్ తో పాటు వైర్లను దొంగిలిస్తుండగా ఆ భవనం వాచ్మెన్ పట్టుకున్నాడు. ఈ విషయాన్ని భవనం యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశాడు. భవనం యజమాని సూచన మేరకు వాచ్మెన్ మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ కు దొంగను తీసుకెళ్తుండగా ప్రభుత్వ పాఠశాల వద్ద వాచ్మెన్ కు ఫోన్ రావడంతో ద్విచక్ర వాహనాన్ని నిలిపివేశాడు. వెంటనే గుర్తుతెలియని దొంగ పారిపోయేందుకు రోడ్డు క్రాస్ చేయబోయాడు. చంద్రాయన గుట్ట నుండి దుర్గా నగర్ వైపు వస్తున్న ఎర్టిగా కారు దొంగను బలంగా ఢీ కొట్టింది. దొంగకు తీవ్ర గాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అవగహన సదస్సు మాట్లాడుతున్న డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ అధ్యక్షురాలు అరుణ...

## చదువు కేవలం మార్కుల కోసం కాదు.. జీవితం నేర్చుకోవడం కోసం!

### డ్రీం ఫర్ గుడ్ సొసైటీ ( ఎన్జీవో) ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సు,

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 22, (ప్రభాత ఉదయం)**

విద్య అనేది కేవలం మార్కుల వేట కాదని, అది గౌరవ ప్రదంగా జీవించడం నేర్చుకోవడానికి ఒక మార్గమని డ్రీం ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణఅన్నారు. మంగళవారం మియాపూర్ వెంకటరమణ కాలనీ (గోకుల్ ప్లాట్స్) లో గల సొసైటీ కార్యాలయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాలంటీర్లకు ఉద్దేశించి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చావా అరుణ మాట్లాడుతూ తల్లిదండ్రులు పడే కష్టాన్ని విద్యార్థులు గుర్తించాలని, క్రమశిక్షణతో కూడిన చదువుతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. సమయపాలన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉండాలి. మన హక్కుల గురించి అడిగే ముందు, మనం నిర్వర్తించాల్సిన బాధ్యతలను సక్రమంగా పూర్తి చేయాలి" అని ఆమె సూచించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ శిశువైద్య నిపుణులు డాక్టర్ దేవయాని మాట్లాడుతూ యువతను పట్టిపీడిస్తున్న వ్యసనాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారి ట్రై చేయి అనే మాటతోనే డ్రగ్స్, సిగరెట్ల వంటి మత్తు పదార్థాలకు యువత బానిస అవుతున్నారని ఇది ఊపిరితిత్తుల వ్యాధులు క్యాన్సర్‌కు దారితీస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ కేసులలో చిక్కుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు రావని, కనీసం పాస్‌పోర్ట్ పొందే అవకాశం కూడా ఉండదని ఆ మచ్చ జీవితాంతం వెన్నాడుతుందని ఆమె స్పష్టం చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండే ధైర్యం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**మార్పునకు మూలం ఉపాధ్యాయులే**

వాలంటీర్లు ప్రజలకు మార్గదర్శకులుగా ఉండాలని, ఉపాధ్యాయులు నవతరాన్ని తీర్చిదిద్దే శిల్పులని జయలక్ష్మి పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి గొప్ప పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విజయలక్ష్మి, ఉష, నందిని, ఉపాధ్యాయులు జలంధర్, జయలక్ష్మి పెద్ద సంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మోడీపై అనుచిత వ్యాఖ్యిలు... ఖర్గే దిష్టిబొమ్మను దగ్ధం చేసిన బిజెపి నాయకులు





**రాజేంద్రనగర్, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ పై కాంగ్రెస్ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి నాయకులు ఆయన దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అత్తాపూర్ డివిజన్ హైదర్గూడా చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోడీ ని అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కరిగే దిష్టిబొమ్మ దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొమురయ్య మాట్లాడుతూ... ఖర్గే గతంలో కూడా హిందు మనోభావాలు దెబ్బతీసేటట్టు మాట్లాడారు ఈసారి ప్రధాని నరేంద్ర మోడీ ని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఖర్గే క్షమాపణ చెప్పాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ విజయ్ కిరణ్ జి రాజు వెంకట్ రెడ్డి శశికాంత్ శర్మ విజయ స్వామి అమర్నాథ్ రెడ్డి ముఖేష్ శ్రీను సంతోష్ బాలకృష్ణ వెంకటేష్ రవీందర్ రెడ్డి పి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

**రాజేంద్రనగర్ లో**

భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ అధ్యక్షతన బుధవారం ఉప్పరపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేశారు. తమిళనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నై బహిరంగ సభలో మాట్లాడుతూ ఏఐడీఎంకే మద్దతు బిజెపికి ఎందుకు ఇస్తుంది



దక్షిణ భారతదేశానికి నరేంద్ర మోడీ ఎటువంటి సహాయం చేయలేదు. ప్రధాన మంత్రి ని టెర్రరిస్టుగా వర్ణించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పేరు మల్లికార్జున కడిగే దిష్టిబొమ్మ దానం చేసి వారు బే షర్టుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసి కాంగ్రెస్ పార్టీ డౌన్డౌన్ అని నినాదాలు ఇవ్వడం జరిగింది. గతంలో కూడ కర్ణాటక ఎన్నికలలో భాగంగా మల్లికార్జున ఖర్గే భారతీయ జనతాపార్టీనాయకులనువిషపూరితమైన పాములతో వర్ణించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోల్కొండ కోసమే జిల్లా ఇన్చార్జ్ వైస్ శ్రీధర్, నారాయణఖేడ్ జిల్లా ఇన్చార్జి బాల్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి వనితారెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షుడు బాబురావు, శ్రీకాంత్ రెడ్డి, బండారి బాలకృష్ణ, రజనీకాంత్ గుప్తా, తిరుమలేష్, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, పవన్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, సరిత రెడ్డి, అంబికా, రాకేష్ గౌడ్, పద్మావతి, జంగయ్య, జ్ఞానేశ్వర్, ప్రకాష్ రెడ్డి,స్వామి, విజయ్ యాదవ్,భూపాల్ ముదిరాజ్, ప్రవీణ్, బాల సాయి, నరేందర్ , నాయకులు పాల్గొన్నారు

# మోగిన ఆర్టీసి సమ్మె సైరన్... డిపోలకే పరిమితమైన బస్సులు





**గద్వాలలో ప్రారంభమైన ఆర్టీసి సమ్మె**

**డిపోలకు పరిమితమైన బస్సులు**

**స్తంభించిన రవాణ.. ప్రయాణికుల ఇక్కట్లు**

**భారీగా మోహరించిన పోలీసులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం)**

ఆర్టీసీని ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో విలీనం చేయాలి, 2021 పీఆర్సీని అమలు చేయాలి, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి మరియు బకాయి ఉన్న పీఎఫ్, సీసీఎస్ నిధులను విడుదల చేయాలి 32 ప్రధాన డిమాండ్ల పరిస్కారం కొరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె సైరన్ మోగించింది. మంగళవారం రోజు ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. ఆర్టీసి జేఏసీ పిలుపు మేరకు తమ డిమాండ్లను పరిష్కారించాలంటూ కోరుతూ బుధవారం గద్వాల ఆర్టీసి డిపో ముందు కార్మికులు కార్మికులు, ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే... మరో సకల జనుల సమ్మెకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. అధికార పార్టీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ప్రజా సంఘాలు కూడా తమ సమ్మెకు మద్దతు తెలిపాయని వెల్లడించారు. తక్షణమే ప్రభుత్వం తమను చర్చలకు ఆహ్వానించి.. సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఉద్యమం తీవ్ర స్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు

**డిపోలకు పరిమితమైన బస్సులు**

ఆర్టీసి కార్మికుల సమ్మెతో ఆర్టీసి బస్సులు గద్వాల డిపోకు పరిమితమయ్యాయి. గద్వాల డిపోలో మొత్తం 110 ఆర్టీసి బస్సులు ఉండగా వాటిలో ప్రభుత్వం 58, 52 ప్రైవేటు బస్సులున్నాయి. బుధవారం తెల్లవారుజామున నుంచి ఆర్టీసిబస్సులు డిపోకు పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ప్రయాణాలు చేశారు.

**భారీగా మోహరించిన పోలీసులు**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో గద్వాల ఆర్టీసి బస్టాండ్ నందు గద్వాల పోలీసులు ముందస్తుగా బందోబస్తు చేపట్టారు. గద్వాల సీఐ టి.శ్రీను, గద్వాల ఎస్ఐ కళ్యాణ్ రావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ సునీత ఆదేశాల మేరకు పోలీస్ పహారాలో ప్రైవేటు డ్రైవర్ల సహాయంతో ఆర్టీసి బస్సులు నడిపారు. ప్రైవేటు బస్సులు మాత్రమే డిపోల నుంచి బయటకు కదులుతున్నాయి.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం





**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన గాజుల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చల్లని తాగునీరు దాహార్తిని తీరుస్తుందని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రధర్ రావు, ప్రతాప్, మోనేష్ మారోజు, భరత్ సింహ్మారెడ్డి, సుభాష్ రెడ్డి, నక్క రవి, వీరేష్ రెడ్డి, కావలి గోపి, గోనెలస్వామి, తదితరులు పాల్గొన్నారు .

**గువ్వలదిన్నెలో చలివేంద్రం ప్రారంభం**

కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ మల్లేష్ గౌడ్, పంచాయతీ సెక్రెటరీ లింగన్న లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో బాటసారులకు, గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నిరంతరం చల్లని నీరు అందుబాటులో ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సెక్రెటరీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాదచారులకు దారేది..?




**రాకపోకలకు వీలులేకుండా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు**

**- పట్టణంలోని రహదారి ఇరువైపులా వెలిసిన దుకాణాలు**

**ఫుట్ పాత్ ల పై అక్రమంగా వెలసిన షెడ్ లు(డబ్బాలు)**

**వాణిజ్య షాపుల ముందు ఖాళీ రోడ్ల స్థలాలను కూడా అద్దెకు ఇస్తున్న దుకాణాల యజమాన్యం**

**తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకొని గద్వాల మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు**

**ఫుట్ పాత్ లపై షెడ్డు కిరాయి రూ.5 వేలు**

**షాపుల ముందున్న ఖాళీ రోడ్డు స్థలం అద్దె రూ.10,000**

**ప్రజాప్రతినిధులకు కాసుల వర్షం కురిపిస్తున్న ఫుట్ పాత్‌లు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఫుట్ పాత్ రోడ్డు అక్రమణ ఇష్టారాజ్యంగా నడుస్తోంది. జిల్లా కేంద్రమైన గద్వాల పట్టణంలో విశాలమైన రోడ్లు నేడు ఇరుకుగా మారి తరుచు ప్రమాదాలకు నిలయాలుగా మారింది. గద్వాల పట్టణంలో రహదారికి ఇరువైపుల పాదాచారుల కోసం వదిలిన ఖాళీ స్థలాలను షాపు యజమానులు, చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు అక్రమించుకుని తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. గద్వాల పట్టణంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో గతంలోనే పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లను నిర్మించేందుకు ఖాళీ స్థలాలను వదిలారు. కానీ ఎక్కడ ప్రత్యేకమైన ఫుట్ పాత్ లు నిర్మించలేదు. ఇదే అదునుగా చూసుకుని వాటిని కూడా కొంతమంది ఆక్రమించుకొని దర్జాగా చిన్నచిన్న షాపులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాదచారులకు దారేది అన్న సందేహం కలుగుతోంది.పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై ఎలాంటి ఆక్రమణలు లేకుండా, పాదచారులు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకునే అంశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వైఫల్యం చెందారన్న విమర్శలున్నాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, దుకాణాలను ఏర్పాటు చేయడమేంటని ప్రశ్నించిన వారికి దర్జాగా పెడ్తాం... ఏం చేసుకుంటారో చేస్కోండని అంటున్నారని కొందరు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అండదం డలతోనే ఫుట్‌పాత్‌లపై దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించి, చివరికి పర్మినెంట్ స్ట్రక్చర్‌తో దుకాణాలను ఏర్పాటు చేసుకున్న సందర్భాలున్నాయి. ఈ నిర్మాణాలన్నీ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేవిధంగా ఉన్నా, నేటి వరకు ఆ దుకాణాలను తొలగించే ప్ర యత్నాలను అధికారులు చేపట్టకపోవడంతో ఆడిం దేఆటగా మారింది.గద్వాల మున్సిపాలిటి పరిధిలో ఎప్పుడు రద్దీగా ఉ ండే రాజీవ్ మార్గ్, రాజవీధి, పాత కూరగాయల మార్కెట్, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, కృష్ణవేణి చౌరస్తా, భీంనగర్, అంబేద్కర్ చౌరస్తాలలో వ్యాపారులు తమ దుకాణాల పేరు మీద పెద్ద పెద్ద ప్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదాచారుల రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. కొన్ని సందర్భాలలో పాదాచారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్త బస్టాండ్, భీంనగర్ లాంటి రద్దీ ప్రాంతాలలో పాదాచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్ పాత్ లను చోటామోటా లీడర్లు ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ఫుట్‌పాత్‌లపై వెలిసిన షాపులను తొలగించాలని, పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌ను కేవలం పాదచారులే వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.




**రోడ్లపైనే వాహనాలు పార్కింగ్, వ్యాపారాలు..**

గద్వాలలో రాజవీధి, గాంధీచౌక్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, కృష్ణవేణి చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, రాజీవ్ మార్గ్ తదితర మార్గాలలో రోడ్డుకు ఇరువైపులా పాదచారుల కొరకు వదిలేసిన ఖాళీ ప్రదేశాలు అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఇష్టారాజ్యంగా రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో రహదారిపై అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేయడం, ఫుట్ పాత్ లపై వ్యాపారస్తుల బోర్డు లు పెట్టడం వల్ల రోడ్లపై వెళ్లే వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ సమస్యగా మారుతోంది దీంతో అటుగా వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్న వారిపై అధికారుల చర్యలు తూతూమంత్రంగా ఉంటున్నాయి.

**ఇరుకుగా మారిన భీంనగర్ రోడ్డు**

కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీ అగ్రహారం వైపునకు వెళ్లే భీంనగర్ రోడ్డు మార్గం చాలా విశాలంగా ఉండేది. విశాలమైన రోడ్లను వ్యాపారులు అక్రమించుకోవడంతో చాలా ఇరుకుగా మారింది. భీంనగర్ లో డ్రైనేజి కాలువను సైతం అక్రమించుకుని చ్యాపారాలు కొనసాగిస్తున్నారు. షాపుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును అక్రమించుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రోడ్లను అక్రమించుకోవడంతో వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు.

**పుట్ పాత్ ఏరూ.10వేలు**

గద్వాల పట్టణం కృష్ణవేణి చౌరస్తా నుంచి నదీ అగ్రహారం రోడ్డు వరకు హోటళ్లు, పానీపూరి, సమోసా, టీ స్టాళ్లు, తదితర తిను బండాదాలకు అడ్డగా భీంనగర్ మారింది. భీంనగర్ అడ్డలో ఏదైన చిరువ్యాపారం పెడితే వ్యాపారం లాభాదాయకంగా ఉండటంతో వ్యాపారులు సైతం భీంనగర్ లో వ్యాపారాలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. భీంనగర్ లో రొడ్డుకు ఇరువైపుల పాదాచారుల కొరకు ఏర్పాటు చేసిన పుట్ పాత్ స్థలాలను వ్యాపారస్తులు దర్జాగా కబ్జాచేస్తున్నారు. చిన్న చిన్న రేకుల షెడ్డు ఏర్పాటు చేసి రూ.5–రూ.10వేల వరకు అద్దెకు ఇస్తున్నారు. అలాగే వాణిజ్య షాపుల ముందున్న పుట్ పాత్ ల రోడ్లను సైతం అక్రమించుకుని చిరువ్యాపారస్తులకు రూ.10,వేలకు అద్దెకు ఇచ్చిన ఘటనలు అనేకం ఉన్నాయి. భీంనగర్ లో ఓ మటన్ సెంటర్ ముందున్న పుట్ పాత్ రోడ్డుపై పానీ పూరి షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. దీనికి నెలకు రూ.10వేల అద్దె షాపు ఓనర్లకు చెల్లిస్తున్నారు. మరీ షాపు ముందు సమోసా ఫాయింట్ పెట్టుకునేందుకు రూ.10వేలు అద్దె చెల్లిస్తున్నారు.

**జాతర దుకాణాలు వద్దు..**

గతంలో భీంనగర్ లో సంతానవేణుగోపాల స్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణంపై ప్రమాదవశాత్తు మట్టి ట్రాక్టర్ డీకొట్టడంతో ఆ ప్రాంతంలో జాతర దుకాణాలు ఏర్పాటుకు నిషేదించాలంటూ కొందరు కోర్టు నుండి స్టే తీసుకవచ్చారు. ఇటీవల జాతర సందర్భంగా జాతర దుజాణాల ఏర్పాటును అడ్డుకున్నారు. మరీ ఇదే భీంనగర్ లో రోడ్లను అక్రమించుకుని రోడ్లపైనే వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటె రోడ్డు ప్రమాదాలు సంభవించవా? అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనేక సంవత్సరాల నుంచి ఆనవాయితీ గా వస్తున్న జాతరను ఇక్కడి నుండి తరలించాలన్నా మేధావులు... పుట్ పాత్ రోడ్లను అక్రమించుకుని దర్జాగా వ్యాపారాలు చేస్తుంటే మౌనం ఎందుకు వహిస్తున్నారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.





## పరుమాల గ్రామంలో
# గుప్త నిధుల కలకలం

గద్వాల మండలం పరుమాల గ్రామంలో గుప్త నిధులు తవ్వకాలు కలకలం రేపాయి. పరమాల గ్రామ శివారులో ఉన్న శ్రీ రంగస్వామి ఆలయ అవరణలో ఉన్న శివలింగం, వినాయక విగ్రహాల కింద గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపినట్లు బుధవారం గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ ఆలయంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు ఆరోపించారు. సుమారు నాలుగు అడుగుల లోతు గుంతను తవ్వారు. అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న గద్వాల సీఐ టి.శ్రీను, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను పట్టుకుంటామని సీఐ టంగుటూరి శ్రీను తెలిపారు.



## వడ్ల కొనుగోలు సెంటర్లను
# వెంటనే ప్రారంభించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం)**

ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల ధాన్యం వడ్ల కొనుగోలు కేంద్రాల్లో పోశారనీ, అయితే నేటికీ ప్రభుత్వ యంత్రాంగం కొనుగోలు ప్రారంభించకపోవడం రైతాంగాన్ని తీవ్రంగా నిరాశపరుస్తోందని" బీఅర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బాసు హన్మంతు నాయుడు పేర్కొన్నారు, మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు కేటిదొడ్డి మండలంలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం కొండాపురం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రంలో తడిచిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రభుత్వం వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయిందని, సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో ధాన్యం వర్షంతో తడిసి ముద్దయిందన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రధర్ రావు, అల్వాల్ పాడు ప్రతాప్‌రెడ్డి, మోనేష్ మారోజు, భరత్ సింహ్మారెడ్డి, సుభాష్ రెడ్డి, నక్క రవి, వీరేష్ రెడ్డి, కావలి గోపి, గోనెలస్వామి, తదితరులు పాల్గొన్నారు



## తారానగర్ రోడ్డు విస్తరణపై
# ప్రభుత్వం పునరాలోచించాలి

**100 అడుగుల ప్రతిపాదనను 60కి తగ్గించాలి**

**బీజేపీ నేత రవికుమార్ యాదవ్ డిమాండ్**

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 22, (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లిలోని తారానగర్ రోడ్డు విస్తీర్ణను ప్రభుత్వం చేపట్టదలచిన 100 అడుగుల రోడ్డు ప్రణాళికపై పునరాలోచన చేయాలని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తారానగర్‌లోని తుల్జా భవానీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, స్థానిక చిరు వ్యాపారులతో భేటీ అయి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తారానగర్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రవికుమార్ యాదవ్‌ను కలిసి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. పోచమ్మ గుడి నుండి హనుమాన్ గుడి వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపడితే తాము రోడ్డున పడతామని వారు వాపోయారు. మూడు తరాలుగా కొనసాగుతున్న ఈ మార్కెట్, వేలాది కుటుంబాలకు ఆధారమని.. చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు, స్థానిక నివాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన చెందారు. ఈ విస్తరణను 60 అడుగులకు తగ్గించాలని వారు విజ్ఞప్తి చేశారు. వ్యాపారుల వినతిపై స్పందించిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ సుల్తాన్ బజార్, బేగం బజార్ మాదిరిగా ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న తారానగర్ మార్కెట్‌ను ధ్వంసం చేయడం సరికాదు. అభివృద్ధి పేరిట ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వ్యాపారం చేసుకుంటున్న వారి పొట్ట కొట్టడం సమంజసం కాదన్నారు. ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డును 60 అడుగులకు పరిమితం చేయాలి. స్థానిక వ్యాపారులకు నివాసితులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రణాళికలు రూపొందించాలి. వేలాది కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. బాధితులకు అన్యాయం జరిగితే సహించేది లేదని భారతీయ జనతా పార్టీ తరపున వారికి అండగా ఉండి పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, ఎల్లేష్, శ్రీనివాసరెడ్డి, రామ్ రెడ్డి, రాజు శెట్టి, దినేష్, మల్లేష్ గౌడ్, విజయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

# ‘ఫ్రెండ్లీ పోలీసింగ్’ బోర్డులకే పరిమితమా? సైబరాబాద్‌లో ఖాకీల ‘కాల్’ నిర్లక్ష్యం!

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 21, (ప్రభాత ఉదయం )**

సామాన్యుడికి ఆపద వస్తే ‘నేనున్నానని’ భరోసా ఇవ్వాల్సిన పోలీసు వ్యవస్థ, సైబరాబాద్‌లో మాత్రం బాధితుల పట్ల విముఖత చూపుతోంది. కోట్లాది రూపాయల ప్రజా ధనంతో అత్యాధునిక కమాండ్ కంట్రోల్ సెంటర్లు, నిఘా నేత్రాలు ఏర్పాటు చేసినా, క్షేత్రస్థాయిలో బాధితులకు మాత్రం ‘ఫోన్ ఎత్తని’ అధికారుల వల్లే చేదు అనుభవాలు మిగులుతున్నాయి. ఐటీ హబ్‌గా వెలుగొందుతున్న ఈ ప్రాంతంలో పోలీసుల తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.





సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ .

**డైల్ 100.. ఒక ఉచిత సలహా!**

రోడ్డు ప్రమాదం జరిగినా, చైన్ స్నాచింగ్ వంటి నేరాలు కళ్లముందే సంభవించినా. బాధితులు లేదా స్థానికులు వెంటనే సంబంధిత సెక్టార్ ఎస్.ఐ కి ఫోన్ చేస్తే వచ్చే సమాధానం కేవలం

**ముందు డైల్ 100 కి ఫోన్ చేయండి**

అనే ఉచిత సలహా మాత్రమే. బాధితుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, ఆస్తి కోల్పోయి ఆవేదనలో ఉన్నా. తక్షణమే స్పందించాల్సిన అధికారులు కాలయాపన చేయడం గమనార్హం. ప్రభుత్వం నెలకు లక్షలాది రూపాయల ఫోన్ బిల్లులు చెల్లిస్తున్నా, ఆ ఫోన్లు కేవలం ఉన్నతాధికారుల ఆదేశాలకో లేదా వ్యక్తిగత అవసరాలకో తప్ప సామాన్యుల కోసం పనిచేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఉన్నతాధికారుల నీడలోనే ‘నిర్లక్ష్యం’ రాజ్యం**

గచ్చిబౌలి పోలీసు స్టేషన్ ప్రాంగణంలోనే డీసీపీ, ఏడీసీపీ, ఏసీపీల కార్యాలయాలు ఉన్నప్పటికీ, అదే భవనంలోని కింది అంతస్తులో ఉన్న గచ్చిబౌలి లా అండ్ ఆర్డర్ మహిళా పోలీస్ స్టేషన్ల తీరు అధ్వాన్నంగా ఉంది.

**విఐపి కల్చర్**

అధికారులు కేవలం తెలిసిన నంబర్లు లేదా విఐపి కాల్స్ మాత్రమే రిసీవ్ చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త నంబర్ల నుంచి కాల్ వస్తే అది బాధితుడి నుంచి కావచ్చనే ఇంగితం కూడా లేకుండా ఫోన్లు పక్కన పడేస్తున్నారు. పర్యవేక్షణ లోపం వల్ల కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**స్టేషన్లలో ‘వసూళ్ల’ పర్వం బాధితులకు తప్పని వేధింపులు**

న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన బాధితులకు భరోసా కల్పించాల్సింది పోయి, వారిని మానసికంగా వేధిస్తూ దర్యాప్తు పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రభాకర్ రెడ్డి నుండి సీవీ ఆనంద్ సీపీగా ఉన్న సమయంలో ఫోన్ ఎత్తని అధికారులపై కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయి. కానీ నేటికీ క్షేత్రస్థాయిలో మార్పు రాకపోవడం గమనార్హం.

**ప్రజా గొంతుక - కొన్ని సూటి ప్రశ్నలు**

1.బాధ్యత ఎక్కడ? కేసుల పర్యవేక్షణపై చూపే శ్రద్ధ, సిబ్బంది ప్రవర్తనపై ఎందుకు ఉండటం లేదు?

2. ప్రజా సేవకులా.. పాలకులా? ప్రజల పన్నులతో జీతాలు తీసుకుంటూ బాధితులకు అందుబాటులో లేని వ్యవస్థ దేనికి సంకేతం?

3. చర్యలేవి? అత్యవసర సమయంలో స్పందించని అధికారులపై కఠిన చర్యలు తీసుకునే మెకానిజం ఎందుకు అమలు కావడం లేదు?

**సీపీ డాక్టర్ రమేష్ స్పందించాలి!**

సైబరాబాద్ కమీషనర్ డాక్టర్ రమేష్ ప్రస్తుతం సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. రాత్రింబవళ్లు పనిచేసే పోలీసుల కష్టాన్ని గౌరవిస్తూనే, వారిలో దాగి ఉన్న కొందరు అవినీతి, నిర్లక్ష్యపూరిత అధికారుల వల్ల మొత్తం విభాగానికి చెడ్డపేరు వస్తోంది. ఐటీ కారిడార్‌లో భద్రత అంటే కేవలం పెట్రోలింగ్ వాహనాలు తిరగడం కాదు. ఆపదలో ఉన్న వ్యక్తి పిలుపునకు తక్షణమే స్పందించడం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో నిఘా పెట్టి, బాధితులకు అండగా నిలవాలని ప్రజలు కోరుతున్నారు.



# ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి..


## ప్రజల గుండెల్లో చెరగని ముద్ర..

### రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్, ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్,ఏప్రిల్22(ప్రభాత ఉదయం)**

మాజీ మంత్రి,దివంగత ఎమ్మెల్యే పట్లోళ్ల ఇంద్రారెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత అని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్, ఇంద్రారెడ్డి ట్రస్ట్ చైర్మన్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు.ఇంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని రాజేంద్రనగర్ సర్కిల్ డైరిఫామ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వర్ధంతి వేడుకల్లో కార్తీక్ రెడ్డి పాల్గొని తన తండ్రి ఇంద్రారెడ్డి చిత్రపటానికి స్థానిక మాజీ కార్పొరేటర్ అర్చన జయప్రకాష్,పార్టీ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి,పోరెడ్డి ధర్మారెడ్డి,లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ...ఇంద్రారెడ్డి ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు.తరాలు మారినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఘనత ఇంద్రారెడ్డికే దక్కుతుందని తెలిపారు.తమ కుటుంబానికి రాజకీయ జీవితాన్నిచ్చిన రాజేంద్రనగర్ ప్రాంత ప్రజలకు తుదిశ్వాస వరకూ సేవ చేస్తామని కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు.తన తండ్రి ఇంద్రారెడ్డిపై ప్రజల చూపించిన ఆదరాభిమానాలే తమకు కొండంత బలాన్నిస్తున్నాయన్నారు.రాజేంద్రనగర్ ప్రాంత ప్రజల ఆదరణను ఎప్పటికీ మరువలేమన్నారు.ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగిస్తామన్నారు.ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతూనే ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి,రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డిధర్మారెడ్డి,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్,శీలం తిరుపతిరెడ్డి,రాఘవేందర్ యాదవ్,హైదర్ గూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిట్టిగారి నరేందర్ రావు,మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్,జాలిగం చిత్తారి,డి. రమేష్ ముదిరాజ్,ఎర్రోళ్ల యాదయ్య,సులేమాన్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మమ్మద్ జహీరుద్దీన్,ఎడ్లకాడి సూర్యం,జీవన్ దాస్,కోరని రవీందర్,పచ్చ శ్రీనివాస్,రాజేష్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు





విద్యార్థులతో కలిసి సహకాంత్ భోజనం చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# హాస్టల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలి: కలెక్టర్ నారాయణ రెడ్డి

## అధికారులను ఆదేశించిన కలెక్టర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 22(ప్రభాత ఉదయం)**

హాస్టళ్లు , రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు. “ప్రజా పాలన – ప్రగతి ప్రణాలిక” కింద సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా, అన్ని ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు , రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతుల కోసం 3వ రోజును పాటించడం జరిగింది. దీని ప్రకారం, అన్ని సంస్థలు తనిఖీలు నిర్వహించి, హాస్టళ్లలోని భవనాలు, పారిశుధ్యం, నీటి సరఫరా, విద్యుత్ పరికరాలు, వంటగది, టాయిలెట్ బ్లాక్‌లు, స్నానాల గదులు మరియు ఇతర ప్రాథమిక సౌకర్యాలకు సంబంధించిన చిన్నపాటి మరమ్మతుల అవసరాలను గుర్తించాయి. ఈ పనులను నమోదు చేసి, అమలు చేయడానికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించడం జరిగింది. ప్రభుత్వ భవనాల విషయంలో, అవసరమైన అంచనాలను సిద్ధం చేసి ఆమోదం కోసం సమర్పించడం జరుగుతోంది . ఈ పనులను వేసవి సెలవుల సమయంలో చేపట్టడం జరుగుతుంది. ప్రైవేట్ భవనాల విషయంలో, 24.04.2026 నుండి అవసరమైన మరమ్మతు పనులను చేపట్టేందుకు భవన యజమానులతో సమన్వయం చేసుకోవాలని సూచనలు జారీ చేయబడ్డాయి. విద్యార్థులకు విద్యా కార్యకలాపాలకు కనీస అసౌకర్యం , ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు, అన్ని మరమ్మతు పనులను వేసవి సెలవుల్లోనే పూర్తి చేయడానికి ప్రణాళిక చేయబడింది. “హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు” అనే 3వ రోజు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఆయా హాస్టళ్లు/రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థుల ఇబ్బందులను నివారించేందుకు, మౌలిక సదుపాయాలు , సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చిన్నపాటి మరమ్మతు పనులను సకాలంలో చేపట్టేందుకు చర్యలు ప్రారంభించబడ్డాయి..ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) కె.శ్రీనివాస్ తో కలిసి మహేశ్వరం మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలపై సత్వరమే నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మహేశ్వరం మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) కె.శ్రీనివాస్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలలో వసతి గృహాలలో నెలకొన్న సమస్యలతో పాటు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలలో రిపేర్లను గుర్తించి నివేదికను సిద్ధం చేయాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. రిపేర్ల కోసం నివేదికను అందించాలని తెలిపారు.గతంలో కంటే ప్రస్తుతం వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో వసతి గృహాలలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వంటశాల, పాఠశాలలోని వంటగది, మెస్ మరియు పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల నుంచి ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల నందు ఎంసెట్ పరీక్షలు వ్రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అందిస్తున్న కోచింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు రావడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థులు ఉన్నతస్థాయి చేరుకునేలా మీరంతా విద్యను బోధించాలని, మీ విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. మీరు ఉత్తమ పౌరులుగా, ఉన్నతస్థాయిలో ఉండే విధంగా, ఉపాధ్యాయునిగా తృప్తి చెందేలా బోధన చేయాలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి చాలా ఉత్తమమైనదని, రాబోయో తరాలను మంచి పౌరులుగా తీర్చిదిద్దే వృత్తిలో ఉన్నందున మంచి బోధనను అందించాలని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి కేష రామ్, తహశీల్దార్, మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన వద్దు..నేను ఆరోగ్యంగానే ఉన్నాను

## పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఏప్రిల్ 22 (ప్రభాత ఉదయం):**



తాను ఆరోగ్యంగానే ఉన్నానని,ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం హైదరాబాదులోని తన కార్యాలయంలో బాత్రూం నుండి వచ్చే సమయంలో కాలుజారి పడటం మూలంగా స్వల్పంగా గాయపడడం జరిగిందని పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. భగవంతుడు కృపతో,పటాన్ చెరు నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో,కార్యకర్తల అభిమానంతో అతి త్వరలో ప్రజాసేవలోకి రానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.



ప్రపంచ ధరిత్రి దినోత్సవం కార్యక్రమం మాట్లాడు తున్న ముఖ్య అతిథి..

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

## హెచ్‌సీయూ ప్రొఫెసర్ జి. కిషోర్ కుమార్

**శేరిలింగంపల్లి : ఏప్రిల్ 22, (ప్రభాత ఉదయం )**

పర్యావరణాన్ని కాపాడుకోవడం ద్వారానే మానవాళికి ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఉంటుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఎర్త్, ఓషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్ ఆచార్యులు జి. కిషోర్ కుమార్ అన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా సోమవారం మసీదుబండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ సదస్సుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజని అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ 1970 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 22న ధరిత్రీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ ఏడాది మన శక్తి మన గ్రహం అనే నినాదంతో సుస్థిర భవిష్యత్తు కోసం పునరుత్పాదక ఇంధన వనరులను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం, అటవీ నిర్మూలన, కార్బన్ ఉద్గారాల వల్ల గాలి, నీరు, నేల కలుషితమై ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని చెప్పారు. కలుషిత నీరు, ఆహారం వల్ల క్యాన్సర్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతున్నాయని డబ్ల్యూ హెచ్ ఓ నివేదిక ప్రకారం 18 శాతం క్యాన్సర్ వ్యాధులకు కాలుష్యమే కారణమని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్’ సూత్రాన్ని పాటించాలని పిలుపునిచ్చారు. మానవాళి మనుగడ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్‌ను విడనాడాలని కోరారు. సేంద్రీయ ఆహారం తీసుకోవాలని, యోగా, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత వాహనాలకు బదులు ప్రజా రవాణాను వాడాలని, సోలార్, విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్, ఉపాధ్యాయులు శ్రీనివాసు, శ్రీనివాస్ గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, వాణి సాంబశివరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్తీ ఆహార తయారీదారులపై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం!

## 22 కేసులు నమోదు.. 28 మంది అరెస్ట్

## రూ. 64 లక్షల విలువైన సామగ్రి సీజ్

**శేరిలింగంపల్లి ఏప్రిల్ 22, (ప్రభాత ఉదయం)**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార మాఫియాపై సైబరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (ఎస్ఓటి) నిప్పులు చెరిగింది. గత నాలుగు నెలలుగా జనవరి నుండి ఏప్రిల్ 21 వరకు కమిషనరేట్ పరిధిలో ముమ్మరంగా దాడులు నిర్వహించి, భారీస్థాయిలో కల్తీ నెట్‌వర్క్‌ను ఛేదించినట్లు పోలీసులు వెల్లడించారు.



కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్న సైబరాబాద్ పోలీసులు...

**దాడుల వివరాలు**

సైబరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేపట్టిన ఈ ఆపరేషన్లలో మొత్తం 22 కేసులు నమోదు కాగా 28 మంది నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా బేకరీ ఉత్పత్తులు, స్వీట్లు, నూనెలు, గోధుమ పిండి, అల్లం-వెల్లుల్లి పేస్ట్, మాంసం ఐస్‌క్రీమ్ వంటి నిత్యావసరాలను కల్తీ చేస్తున్న ముఠాలపై పోలీసులు దృష్టి సారించారు.

**విస్తుపోయే వాస్తవాలు**

తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలు భయాందోళన కలిగిస్తున్నాయి.అపరిశుభ్ర వాతావరణంలో ఎటువంటి అనుమతులు లేకుండా, మురికి కూపాలను తలపించే ప్రాంతాల్లో ఆహార పదార్థాల తయారీ. హానికర రసాయనాలు, గడువు ముగిసిన ముడి సరుకులు, కృత్రిమ రంగులు మరియు ప్రాణాంతక రసాయనాల వినియోగిస్తున్న దాడులలో తెలింది. వాడిన నూనెనే పదేపదే మరిగించి వినియోగించడం ద్వారా ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నట్లు గుర్తించారు.

**భారీగా సీజ్ చేసిన సరుకు**

ఒక ప్రధాన కేసులో సుమారు 5,026 లీటర్ల కల్తీ నూనె, 5,192 కిలోల గోధుమ పిండిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే హానికర రసాయనాలతో తయారు చేస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్ యూనిట్లను కూడా సీజ్ చేశారు. రూ. 64.07 లక్షల విలువైన ఆహార పదార్థాలు యంత్రాలు, వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల ఆరోగ్యానికి విఘాతం కలిగించే వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు. నిరంతరం నిఘా కొనసాగుతుంది. ఎస్ఓటి డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు.

**ప్రజలకు సూచనలు**

ఆహార పదార్థాలు కొనేటప్పుడు కేవలం లైసెన్స్ ఉన్న దుకాణాల నుండే కొనుగోలు చేయాలి. ప్యాకెట్లపై ఎక్స్‌పైరీ డేట్ తప్పనిసరిగా గమనించాలి. ఎక్కడైనా కల్తీ జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ విభాగానికి ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.